# కొనసాగుతున్న ధాన్యం దంగల్



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంత పల్లి కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలిస్తున్న అధికారులు

## కదిలించిన 'నమస్తే' కథనం

### కొనుగోళ్లు ప్రారంభించిన అధికారయంత్రాగం

### జంగా నర్సవ్వ కుటుంబానికి బెదిరింపులు

కరీంనగర్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లిలో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు.. మహిళా రైతు నర్సవ్వ ఆవేదనపై గురువారం 'నమస్తే తెలంగాణలో' వచ్చిన కథనం కలకలం రేపింది. దీనిపై స్పందించిన అధికార యంత్రాగం గురువారం కొనుగోళ్లు ప్రారంభించడంతోపాటు.. అక్కడి నుంచి ధాన్యం తరలించే కార్యక్రమాన్ని చేపట్టింది. కాగా తనతోపాటు తోటి రైతులకు జరుగుతున్న ఇబ్బందులను ఎండగట్టిన జంగా నర్సవ్వ కుటుంబ సభ్యులను కొంత మంది కాంగ్రెస్ నాయకులు బెదిరించారు. దుబాయిలో ఉన్న తన కొడుకుకి ఫోన్‌చేసి.. కొంతమంది నాయకులు బెదిరింపులకు దిగారని జంగా నర్సవ్వ వెల్లడించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొనుగోలు కేంద్రానికి వెళ్లి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. 'నమస్తే' కథనంతో కదలివచ్చిన అధికారయంత్రాగం తీరును చూసి.. రైతులు ఆనందం వ్యక్తంచేశారు.



**నడిరోడ్డుపై అన్నదాతల బైఠాయింపు**

ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన రైతులు గురువారం 161వ జాతీయ రహదారిపై గడిపెద్దాపూర్ వద్ద రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై వాహనాలు, ధాన్యం మ్యాచర్ పరికరాన్ని అడ్డంగా పెట్టి బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని తరలించడంలో జాప్యం చేస్తుండటంతో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసి పోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను అధికారులకు విన్నవించడంతో ఆందోళన విరమించారు. –అల్లాదుర్గం

### • తరుగుపై రైతన్న ఆందోళన



మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో బస్తాలు తడిసి ధాన్యం మొలకెత్తడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లులకు తీసుకువెళ్తే కటింగ్ పేరుతో 4 కిలోల నుంచి 10 కిలోల వరకు కోత పెడుతున్నారంటూ రైతులు గురువారం పెద్దముప్పారంలో రోడ్డుపై బైఠాయించారు. తరుగు లేకుండా కాంటా పెట్టకపోతే చావే శరణ్యమని వారు హెచ్చరించారు. – దంతాలపల్లి

### • కలెక్టర్ సారూ జర పట్టించుకోండి..



పక్షం రోజులైనా ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ ఓ రైతు గురువారం ఏకంగా వడ్ల బస్తాతో నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపాడు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం బాబాపూర్‌కు చెందిన రైతు బొట్టు శ్రీనివాస్ పక్షం రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చాడు. తేమ శాతం వచ్చినా లారీలు, హమాలీలు రాలేదని నిర్వాహకులు కొనుగోలు చేయలేదు. వర్షాలకు ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని ఎక్కువ తూకం వేయాలని నిర్వాహకులు తెలపడంతో రైతు ఆందోళన చెంది వడ్ల బస్తాను నిర్మల్ కలెక్టర్‌కు తీసుకొచ్చి నిరసన తెలిపాడు. –నిర్మల్ చైన్‌గేట్

### • కాళ్లు మొక్కినందుకు కదిలిండ్రు



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను చకాచకా తరలిస్తున్నారు. వడ్లు కాంటా పెట్టాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని రైతులు బుధవారం నర్సింహులపేట తహసీల్దార్ రమేశ్‌బాబు కాళ్లు మొక్కి వేడుకోవడంతో గురువారం అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రంలో కాంటాలు పెట్టిన ఆరు వేల బస్తాల్లో 4 వేల బస్తాలను నాలుగు లారీలు, ఒక డీసీఎం వాహనంలో మిల్లుకు తరలించారు. అదేవిధంగా వెయ్యి బస్తాలు కాంటా పెట్టినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన సుమారు 3 వేల బస్తాలు కాంటాలు పెట్టాల్సి ఉన్నదని, కాంటా పెట్టిన 2 వేల బస్తాలను శనివారం వరకు పూర్తిస్థాయిలో మిల్లులకు తరలిస్తామని పేర్కొన్నారు. –నర్సింహులపేట

### • మహబూబాబాద్ జిల్లాలో రైస్‌మిల్లు ఎదుట నిరసన



ధాన్యం తూకంలో కోత విధించొద్దంటూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని ఓం సాయిరాం రైస్ మిల్లు ఎదుట గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దవంగర మండలం పోచంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ఈ నెల 24న లారీలో ఆరుగురు రైతులకు చెందిన 932 బస్తాల ధాన్యం కేసముద్రం మండల కేంద్రంలోని ఓం సాయి రైస్ మిల్లుకు దిగుమతి చేసినట్టు తెలిపారు. అయితే మిల్లరు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కో బస్తాకు 2 కిలోల చొప్పున క్వింటాల్‌కు 5 కిలోలు కోత విధిస్తున్నట్టు చెప్పారు. పోలీసులు మిల్లు వద్దకు చేరుకొని తూకంలో కోత విధించవద్దని వ్యాపారులకు సూచించడంతో రైతులు ఆందోళన విరమించారు. – కేసముద్రం

## బంగాళాఖాతంలో వాయుగుండం

### తెలంగాణలో మూడ్రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారిందని వాతావరణశాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. బాలాసోర్‌కు 180కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన వాయుగుండం.. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్‌ల మధ్య తీరం దాటనున్నదని తెలిపింది. ఈ వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. దీంతో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లను జారీచేసినట్టు తెలిపింది. ఈ వాయుగుండం తుపానుగా మారే అవకాశం కూడా ఉన్నదని హెచ్చరించింది. గురువారం 11:30గంటలకు సాగర్ ద్వీపం–ఖేపుపారా మధ్య పశ్చిమబెంగాల్–బంగ్లాదేశ్ తీరాలను దాటిందని వెల్లడించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించడంతో పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నది.

### • 'జీలుగ'కూ తప్పని పాస్ పుస్తకాల క్యూ



జీలుగ విత్తనాల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట పట్టణ, మండల రైతులు పట్టా పాసుపుస్తకాలను క్యూలైన్‌లో ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వానకాలం ప్రారంభానికి ముందే జీలుగు విత్తనాలను అందుబాటులో ఉంచేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. విత్తనాలను రెట్టింపు ధరలకు విక్రయిస్తుండటంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. – కోరుట్ల రూరల్

## రూ.కోటి ఇస్తేనే భూములిస్తం

- రేడియల్ రోడ్డు భూసేకరణకు రైతుల నుంచి తీవ్ర అభ్యంతరం
- సేకరణ సాగక మల్లగుల్లాలు పడుతున్న అధికారులు
- నివేదిక ఇస్తామని, సర్కారే తేల్చుకోవాలని వ్యాఖ్యలు



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన రేడియల్ రోడ్డుకు రైతులు రెడ్ సిగ్నల్ వేసినట్టు కనిపిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు గొప్పగా చెప్పుకుంటున్న ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి ప్రతిపాదిత రోడ్డు కీలకమని అధికారులు పేర్కొంటున్నారు. కానీ పరిహారం విషయంలో అన్యాయంగా వ్యవహరిస్తే భూములు ఇవ్వబోమని రైతులు తేల్చిచెప్తున్నారు. దీంతో రేడియల్ రోడ్డుపై కసరత్తు ముందుకు సాగడంలేదు. రంగారెడ్డి జిల్లాలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా భూముల ధర ఎకరాకు కోటి రూపాయల వరకు పలుకుతున్నదని, రోడ్డు, హైవేకు దగ్గరగా ఉంటే మరింత ఎక్కువగా నడుస్తున్నదని యజమానులు చెప్తున్నారు. ప్రభుత్వం మాత్రం రేడియల్ రోడ్డు కోసం సేకరించే భూమికి ఎకరాకు రూ.25లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పడమేంటని మండిపడుతున్నారు. దీంతో రేడియల్ రోడ్డు భవితవ్యంపై అధికారుల కసరత్తు అగమ్యగోచరంగా మారింది.

**ఎకరాకు కోటి ఇస్తేనే భూములు**

ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్‌ను అనుసంధానించేందుకు ఆరులేన్ల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. రేడియల్ రోడ్డుతో ఫ్యూచర్‌సిటీని కూడా కలుపుతామని ప్రకటించింది. దీనికి రతన్‌టాటా రోడ్డుగా పేరు కూడా పెట్టింది. సుమారు రూ.4,000 కోట్లకుపైగా అంచనా వ్యయంతో రెండు దశల్లో రేడియల్ రోడ్డును నిర్మించే బాధ్యతను హెచ్‌ఎండీఏకు అప్పగించింది. 330 అడుగుల వెడల్పుయిన రోడ్డు నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో సుమారు 1,000 ఎకరాల భూసేకరణకు రెవెన్యూశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ రైతులు ఎకరాకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాల్సిందేనని, లేకపోతే భూములు ఇవ్వబోమని చెప్తున్నారు. దీంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సర్కారు చెప్తున్న ధరకు యజమానులు భూములు ఇవ్వడంలేదని, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదిక రూపంలో చెప్తామని అధికారులు అంటున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు చేపడతామని చెప్తున్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపు

హైదరాబాద్ మే 29 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద అంగన్‌వాడీ టీచర్‌కు రూ. 2లక్షలు, హెల్పర్‌కు రూ. లక్ష ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్కారు నిర్ణయంతో సుమారు 70 వేల మందికి ప్రయోజనం చేకూరనున్నది.

అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 2 లక్షలు, రూ. లక్ష చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గద్దెనెక్కిన వెంటనే రిటైర్మెంట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ బెనిఫిట్స్ ఇవ్వడం మాత్రం మరిచిపోయింది. దీంతో సుమారు 10 వేల మంది టీచర్లు, సహాయకులు బెనిఫిట్స్ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్నారు. పలువురు ప్రయోజనాలు పొందకుండానే మరణించారు. అయితే ఇప్పుడు ఆఘమేఘాలపై రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని నిర్ణయించడంపై అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికల నగారా మోగనున్నదనే వార్తలు వస్తున్న తరుణంలో ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని నిర్ణయించిందని సందేహం వ్యక్తం చేస్తున్నారు.



పెంచికల్‌పేట్‌లో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

## ఆర్థికపరమైన పనులు చేయలేం

### తేల్చి చెప్పిన పంచాయతీ కార్యదర్శులు

కౌటాల/పెంచికల్‌పేట్, మే 29 : 'ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇకపై ఆర్థికపరమైన పనులు చేపట్టలేం' అంటూ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తేల్చిచెప్పారు. గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, పెంచికల్‌పేట్‌లో ఎంపీడీవో ఆల్బర్ట్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నెలలుగా తాము చేసిన పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి బిల్లులు రాలేదని, దీంతో ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సొంత డబ్బులు పెట్టుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, ఇక ఆ స్థోమత తమకు లేదని స్పష్టంచేశారు. పెండింగ్ బిల్లులతో పాటు రాబోయే వానకాలం నిధులు ఇస్తేనే ఆర్థికపరమైన పనులు చేస్తామని స్పష్టంచేశారు.

### • జీలుగ విత్తనాలు ఏవీ?



సరిపడా పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయలేక చేతులెత్తేసిన అధికారులపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి రైతు వేదికలో గురువారం సబ్సిడీపై జీలుగ, పెద్దజనుము విత్తనాల పంపిణీని అధికారులు ప్రారంభించారు. రైతులు పెద్ద సంఖ్యలో రాగా, సగం మందికి కూడా విత్తనాలు దొరకలేదు. దీంతో అన్నదాతలు అధికారులపై మండిపడ్డారు. అవసరమైనన్ని విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడంపై నిలదీశారు. – కామారెడ్డి రూరల్

## జూరాల 12 గేట్లు ఎత్తివేత

### 82వేల క్యూసెక్కులు దిగువకు

### తుంగభద్ర నదికి భారీగా వరద

### సుంకేసుల గేటు ద్వారా నీటి విడుదల

### శ్రీశైలంకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహబూబ్‌నగర్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కృష్ణ, తుంగభద్ర నదులకు వరద మొదలైంది. కృష్ణమ్మకు ఒక్కసారిగా ప్రవాహం పెరగడంతో జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. దీంతో గురువారం ప్రాజెక్టు 12 గేట్లను తెరిచిన అధికారులు దిగువకు 82 వేల క్యూసెక్కులను శ్రీశైలం జలాశయం వైపు విడుదల చేశారు. అర్ధరాత్రి వరకు లక్ష క్యూసెక్కులు దాటే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. మరోవైపు తుంగభద్ర నదికి వరద పోటెత్తుతున్నది. 15 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. సుంకేసుల డ్యాం నిండిపోవడంతో మధ్యాహ్నం మూడు గేట్లు ఎత్తి.. సాయంత్రానికి ఒక గేటు ద్వారా నీటిని విడుదల చేశారు. ఆర్డీఎస్ వద్ద 5,913 క్యూసెక్కులుగా నమోదైంది. రెండు జీవనదులు పొంగిపొర్లుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. వర్షాకాలం ఇంకా ప్రారంభం కాకముందే ప్రధాన నదులకు వరద పోటెత్తడం ఇదే తొలిసారి. నాలుగు రోజుల కిందట కృష్ణానదికి స్వల్పంగా వచ్చిన వరద క్రమంగా పెరుగుతూ కొన్ని గంటల్లోనే జూరాల నిండిపోయింది. శుక్రవారం వరకు ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నదని, దీంతో మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ